పలమనేరు పెద్దచెరువులోని మురుగునీటిలో పెరిగిన చేపలు



పట్టణంలోని పెద్ద చెరువులో ఎంత కరువు పరిస్థితులు వచ్చినా ఎప్పుడూ ఎండిదంటూ లేదు. ఎందుకంటే..పట్టణంలోని మురుగునీరంతా ఈ చెరువుకు చేరడంతోపాటు చెత్తాచెదారంతో చెరువు కంపు కొడుతూ ఉంటుంది. ఇలాంటి ×మురుగు₹ చెరువులో ఎంచక్కా చేపలు పెంచి విక్రయిస్తున్నారు! చెరువు ఎలాంటిదో తెలుసు కాబట్టి పట్టణ ప్రజలు వీటిలోని చేపలు అస్సలు తినరు. దీంతో చేపలు పెంచిన వ్యాపారులు ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తుండగా, ఇదే కోవలో తమిళనాడులోని మురుగు నీటి చెరువుల్లో పెంచిన చేపలను మంచినీటి చెరువుల చేపలంటూ పలమనేరులో విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు.

మురుగునీటిలో పెరిగే చేపలు తినరాదని తెలిసి వేలం!

మైనర్ ఇరిగేషన్ చెరువులకు సంబంధించి చేపల వేలం వేసే హక్కు మున్సిపాలిటీకి లేదు. దీంతో స్థానిక మత్స్యశాఖ ఏటా పెద్ద చెరువు వేలం వేస్తోంది. ఇక్కడి మురుగు నీటిలో పెరిగిన చేపలు ఏమాత్రం ఆరోగ్యానికి శ్రేయస్కరం కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కానీ ఆదాయం కోసం అధికారులు వేలం పేరిట ప్రతి సంవత్సరం ఈ చెరువులో చేపలను పెంచేందుకు అవకాశం కల్పిస్తున్నారు. పరోక్షంగా ప్రజల ఆరోగ్యానికి చేటు కలిగిస్తున్నారనే విమర్శలు మూటకట్టుకుంటున్నారు. ఈ చెరువు ఎప్పుడు బాగుపడుతుందోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

మురుగు చేపలు బాబోయ్..!

- పెద్దచెరువు వద్ద చేపలు పడుతుంటే కంపు..కంపు
- పలమనేరు వాసులు కొనరని ఇతర ప్రాంతాల్లో విక్రయం
- తమిళనాడు, కర్ణాటక మురుగు చెరువుల చేపలు ఇక్కడ అమ్మకం!
- వ్యాపారులు దొందూ దొందే
- ప్రజల ఆరోగ్యంతో చెడుగుడు

కన్యాకుమారిలో చేపనూనె పరిశ్రమకట..!

ప్రస్తుతం పలమనేరులోని మురుగునీటిలో పెరిగిన పక్కి అనే పేరున్న చేపలను పట్టి లారీల్లో బయటి ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. ఇక్కడి స్థానికులు వీటి గురించి ప్రశ్నిస్తే.. ఇవి తినేందుకు కాదని, తాము తమిళనాడులోని కన్యాకుమారిలో చేపనూనె పరిశ్రమకు విక్రయిస్తున్నట్టు చెబుతున్నారు. ఇదేవిధంగా తమిళనాడు, కర్ణాటకలోని మురుగునీరు చేరే పలు చెరువుల్లో ఏపుగా పెరిగిన చేపలకు అక్కడ కొన్ని వ్యాపారులు చేప నూనె ఫ్యాక్టరీలకంటూ స్థానిక చేపల మార్కెట్లకు అమ్మడం గమనార్హం! చేపనూనె ఫ్యాక్టరీలు చేపలను కిలో రూ.30 నుంచి రూ.50 దాకా కొంటున్నాయి. అదే చేపలను కొత్త ప్రాంతాల్లో కిలో రూ.90కి, చేపల వ్యాపారులు రీటైల్‌గా కిలో రూ.150 వరకూ అమ్ముతూ జనానికి అంటగడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఏవి మంచివో, ఏవి ఆరోగ్యానికి చేటు కలిగించేవో ప్రజలకు తెలియడం లేదు.



ఏసీ కంటైనర్లలోకి నింపేందుకు ట్రాక్టరులో తెచ్చిన చేపలు

పలమనేరు: పట్టణ సమీపంలోని పెద్ద చెరువును వేలంలో దక్కించుకున్నవారు ఈ చెరువులో చేపలను పెంచుతున్నారు. వంద ఎకరాల పైబడి విస్తీర్ణం ఉండడంతో దీనిని మైనర్ ఇరిగేషన్ ట్యాంకుగా పరిగణిస్తున్నారు. దీనిపై పూర్తి అజమాయిషీ కూడా ఇరిగేషన్ శాఖదే. పలమనేరు జనాభా 60 వేల దాకా ఉంది. రోజువారీ నీటి వినియోగం దాదాపు 3.1 ఎంఎల్‌డీ. ఇందులో మురుగునీరుగా 2.47 ఎంఎల్‌డీగా ఉంటుంది. ఇక, కొత్తపేట నుంచి వచ్చే మురుగు నీరు నిత్యం ఓ ఎంఎల్‌డీదాకా పెద్ద చెరువులో కలుస్తూండడంతో చెరువు కలుషితమైంది. గతంలో ఇక్కడ మురుగునీరు చెరువులోకి వెళ్లకుండా డైవర్షన్ ఛానెల్ పనులు మొదలై ఆగిపోయాయి.

ఇతర మురుగునీటి చెరువుల నుంచి ఇక్కడికి..!

పెద్దచెరువు తరహాలోనే ఇతర ప్రాంతాల్లోని మురుగునీటి చెరువుల్లో పెరిగిన చేపలను అక్కడివారు కొనడం లేదు. దీంతో అక్కడి చేపలను ఇక్కడి వ్యాపారులు కారుచౌకగా అమ్మేస్తున్నారు. ఇవి మంచి నీటి చేపలని, సముద్రం చేపలంటూ ఇక్కడి వ్యాపారులు స్థానికులను బురిడీ కొట్టి విక్రయిస్తున్నారు. అసలు చేపలు ఎక్కడ పెంచారు? ఎక్కడ నుంచి తెచ్చి విక్రయిస్తున్నారనేది వినియోగదారులకు తెలియకుండా పోతోంది.



మురుగునీటితో ఉన్న పెద్దచెరువు, చెరువులోకి కొత్తపేట నుంచి మురుగునీరు వచ్చే గుండుబావి వద్ద రాజకాలువ ఇదే, గతంలో డైవర్షన్ ఛానెల్ కోసం నిర్మాణం చేపట్టి ఆగిన కాలువ పనులు

క్లుప్తంగా

పెద్దిరెడ్డిని పరామర్శించిన నాయకులు



ఎమ్మెల్యే పెద్దిరెడ్డిని కలసిన సదుం వైఎస్సార్‌సీపీ నాయకులు

సదుం: పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని సదుం మండలానికి చెందిన ప్రజా ప్రతినిధులు, పలువురు నాయకులు పరామర్శించారు. ఎమ్మెల్యే చేతికి శస్త్ర చికిత్స చేసుకుని తిరుపతిలోని ఆయన స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేను వీరంతా పరామర్శించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జిల్లా ఐటీ విభాగం అధ్యక్షుడు ప్రకాష్ రెడ్డి, సర్పంచ్ మనోహర్ రెడ్డి, సయ్యద్ బాషా, కమృద్దీన్, షబ్బీర్, బావాజి, మునాఫ్, రమేష్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, దిలీప్ రెడ్డి ఉన్నారు.

గంగమ్మకు వెండి కిరీటం సమర్పణ



బోయకొండలో వెండి కిరీటాన్ని ఈఓకు అందజేస్తున్న భక్తుడు

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మకు పెద్దపంజాణి మండలం బట్టందొడ్డికి చెందిన ఆర్.మోహన్‌రెడ్డి దంపతులు మంగళవారం వెండి కిరీటం సమర్పించారు. తమ కోర్కెలు ఫలించడంతో అమ్మవారికి సుమారు 250 గ్రాముల బరువు గల వెండి అర్ధకిరీటాన్ని వారు ఈఓ ఏకాంబరానికి అందజేశారు. ప్రత్యేక పూజల అనంతరం మోహన్‌రెడ్డి దంపతులను ఈఓ సత్కరించి ప్రసాదాలు అందజేశారు.

సోమేశ్వరస్వామికి మంటపోత్సవ సేవ



ఊరేగుతున్న సోమేశ్వరస్వామి

పుంగనూరు: స్థానిక నగిరివీధిలోని సోమేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా 4వ రోజు మంగళవారం మంటపోత్సవ సేవ నిర్వహించారు. తొలుత శివపార్వతుల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, హోమాలు చేశారు. అనంతరం పురవీధులలో ఊరేగించారు. భక్తులకు అర్చకులు షణ్ముకదీక్షితులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

గిరిజన పాఠశాలకు స్థలం కేటాయించరూ!



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పుంగనూరు: మండలంలోని గిరిజన విద్యార్థుల కోసం అధునాతన వసతులతో పాఠశాలను నిర్మించేందుకు 5 ఎకరాల స్థలం కేటాయించాలని మంగళవారం ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ చైర్మన్ రామయ్య, మెంబరు డాక్టర్ బాణావత్ మునీంద్రనాయక్ తదితరులు మంగళవారం స్థానిక తహసీల్దార్ రాముకు వినతిపత్రం సమర్పించారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబ సభ్యుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు హరిశివప్ప, వెంకట్రమణ, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఎస్ఐ మృతి



వేణుగోపాల్ రెడ్డి (ఫైల్)

రొంపిచెర్ల: విశ్రాంత ఎస్ఐ కమలాపురం వేణుగోపాల్ రెడ్డి (72) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం రాత్రి చంద్రగిరిలో మృతి చెందారు. మండలంలోని జాండ్లవారిపల్లె గ్రామ పంచాయతీ దుస్సావాండ్లపల్లెకు చెందిన ఆయన పోలీసుశాఖలో కానిస్టేబుల్‌గా చేరి ఆ తర్వాత ఎస్ఐ అయ్యారు. పీలేరు, భాకరాపేట, చంద్రగిరి, తిరుపతి, ఎర్రావారిపాళ్యం పోలీసు స్టేషన్లలో పని చేశారు. ఆయనకు భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. పలువురు అధికారులు, ప్రజా ప్రతి నిధులు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. బుధవారం ఉదయం 10 గంటలకు దుస్సావారిపల్లెలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

నోటీస్ బోర్డు

10న జాబ్ మేళా రిజిస్ట్రేషన్ క్యాంపు

పెద్దపంజాణి: స్థానిక వెలుగు కార్యాలయంలో ఈ నెల 10వ తేదీ గురువారం ఉదయం 10.30 గంటలకు డీఆర్‌డీఏ, సీ–డాప్ సంస్థల ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జాబ్ రిజిస్ట్రేషన్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బాలాజి, ఏపీఎం మీరాబాయి, జాబ్ కో–ఆర్డినేటర్ వినోద్ మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 30 ఏళ్లలోపు ఉన్న యువత విద్యార్హత ధృవీకరణ పత్రాలతో హాజరై రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఎంపికైన వారికి ఉపాధి శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తారన్నారు. పూర్తి వివరాలకు 7672096930 సెల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

10న చౌడేపల్లెలో కూడా..

చౌడేపల్లె: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని వెలుగు కార్యాలయంలో ఈనెల 10న గురువారం సి–డాప్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా రిజిస్ట్రేషన్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఏపీఎం సుబ్రమణ్యం తెలిపారు. 18 నుంచి 30 ఏళ్లలోపు ఉన్న యువతీ యువకులు అర్హులన్నారు. పదో తరగతి పాసైన వారు ,డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా పూర్తిచేసిన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 96761 80056 సెల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

భార్య మీద కోపంతో..!

పుంగనూరు: భార్యమీద కోపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతున్న వ్యక్తి మంగళవారం ఉదయం మృతి చెందాడు. మండలంలోని ఆరంట్లపల్లెకు చెందిన సుబ్రమణ్యం(32) ఈనెల 4న భార్యతో గొడవ పడి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు ప్రథమ చికిత్స చేయించి హుటాహుటిన తిరుపతికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సుబ్రమణ్యం మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి



సర్వర్‌పేటలో మురుగు కాలువల శుభ్రం పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

రొంపిచెర్ల: గ్రామాల్లో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి కోరా రు. మంగళవారం బొమ్మయ్యగారిపల్లె గ్రామ పంచాయతీ సర్వర్‌పేటలో పారిశుధ్యం మెరుగు పనులను ఆయన పరిశీలించారు. ఆయన మా ట్లాడుతూ, మురుగు కాలువలు పూడితే దోమలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యం బారిన పడే పరిస్థితి ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకుని ఇళ్లలోని చెత్తాచెదారాన్ని ఎక్కడబడితే అక్కడ వేయరాదన్నారు. పొడి, తడి చెత్తను వేర్వేరుగా ఉంచుకుని గ్రామ పంచాయతీ ట్రాక్టర్ వచ్చినప్పుడు దానిలో వేయాలన్నారు. ఈ చెత్తను డంపింగ్ యార్డుకు తరలించి ఎరువుగా తయారు చేసి, తక్కువ ధరకు విక్రయించి, ఆ సొమ్మును పంచాయతీ అభివృద్ధికి ఖర్చు చేస్తామన్నారు. కార్యదర్శులు గ్రామాల్లో పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్యదర్శి హరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్న పిల్లలకు మధుమేహ వ్యాధిపై ఉచిత వైద్యశిబిరం

- నేడు బెంగళూరు నిపుణులతో వైద్య పరీక్షలు



పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న పీఈఓస్ ఆస్పత్రి సూపరింటెండెంట్

గుడుపల్లె: చిన్న పిల్లలకు మధుమేహ వ్యాధిపై తమ ఆసుపత్రిలో ప్రతి మూడు నెలలకోసారి ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని పీఈఎస్ సూపరింటెండెంట్ సుబ్రమణ్య కోరారు. మంగళవారం పీఈఎస్ ఆసుపత్రిలో పిల్లల తల్లిదండ్రులకు ఉచిత వైద్య శిబిరాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి సుబ్రమణ్య మాట్లాడారు. ప్రతి బుధవారం బెంగళూరుకు చెందిన ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ సుష్మ పర్యవేక్షణలో వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ప్రస్తుతం చిన్న పిల్లల విభాగంలో 30 పిల్లలకు మధుమేహ వ్యాధికి చికిత్స చేస్తున్నట్టు చెప్పారు. మధుమేహంతో బాధ పడుతున్న పిల్లల కుటుంబాలు మెరుగైన ఆరోగ్యం కోసం ఈ శిబిరాల సేవలను వినియోగించుకోవాలని కోరారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు



సి.బండపల్లె వద్ద రక్షిత మంచినీటి బోరును పరిశీలిస్తున్న ఎంపీడీఓ కుమార్

శాంతిపురం: గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఏపీఆర్ కుమార్ ఆదేశించారు. మంగళవారం ఆయన సి.బండపల్లె, కడపల్లె, కర్లగట్ట గ్రామాల్లో తాగునీటి సరఫరా తీరును పరిశీలించిన అనంతరం మాట్లాడారు. గ్రామాల్లో ఎక్కడైనా నీటి సమస్య తలెత్తితే ప్రజలు తన సెల్ నంబరు 9491071394కు ఫోను చేయవచ్చని చెప్పారు. వేసవిలో నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని అక్రమ నీటి కనెక్షన్లను వినియోగదారులే స్వచ్ఛందంగా తొలగించాలని కోరారు. బేవనపల్లెలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి పౌష్టికాహారం కిట్లను పరిశీలించారు. కిచెన్‌లో వసతులు లేవని అంగన్‌వాడీ కార్యకర్త ఎంపీడీఓ దృష్టికి తేవడంతో తగు ఏర్పాట్లు చేయాలని స్థానిక పంచాయతీ కార్యదర్శి అంజాద్ బాషా, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శివాజిని ఆదేశించారు.

ఆశా కార్యకర్త మృతి



లక్ష్మీదేవి (ఫైల్)

చౌడేపల్లె: అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ ఆశా కార్యకర్త మరణించింది. వివరాలు..మృతురాలి కుటుంబీకుల కథనం..మండలంలోని పెద్దయల్లకుంట్లకు చెందిన ఆశా కార్యకర్త లక్ష్మీదేవి(43) పదేళ్ల నుంచి ఆశా కార్యకర్తగా పనిచేస్తోంది. రెండు రోజుల క్రితం ఆకస్మాత్తుగా వాంతులై తీవ్ర అస్వస్థతకు గురైంది. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మదనపల్లెకు తరలించారు. చికిత్స పొందుతూ ఆమె సోమవారం రాత్రి మరణించింది. గ్రామీణులకు తన సేవలతో మంచి పేరు తెచ్చుకున్న లక్ష్మీదేవి మృతి తమను కలచివేసిందని డాక్టర్ పవన్‌కుమార్, సిబ్బంది ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

బస్టాండు మేనేజర్‌కు హైబీపీ

చిత్తూరు రూరల్(కాణిపాకం): ఆర్టీసీ బస్‌స్టేషన్ మేనేజర్ రవీంద్ర హైబీపీకి లోనై అస్వస్థతకు గురైన ఘటన చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్‌లో చోటుచేసుకుంది. వివరాలు..కొన్ని రోజులుగా బస్టాండ్‌లోని మరుగుదొడ్లు శుభ్రంగా లేకపోవడంతో దుర్వాసన వస్తున్నట్లు డీపీటీఓ జగదీష్‌కు ఫిర్యాదులు వస్తున్నాయి. దీనిపై ఆయన స్పందించారు. మూడు రోజుల్లో మరుగుదొడ్లు శుభ్రం చేయించాలని బస్‌స్టేషన్ మేనేజర్ రవీంద్రను ఆదేశించారు. అయితే శుభ్రం చేసినా మళ్లీ దుర్గంధం వస్తుండడంతో మంగళవారం రవీంద్రపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఆయన అధిక రక్తపోటుకు గురై పడిపోయారు. హుటాహుటిన ఆర్టీసీ సిబ్బంది బస్టాండుకు సమీపంలోని ఆస్పత్రిలో చేర్చారు.

భూ వివాదం: ఇరువర్గాల ఘర్షణ

పుంగనూరు: భూ వివాదంతో ఇరువర్గాలు దాడులు చేసుకున్న ఘటన మంగళవారం మండలంలోని చిన్నగడదేశి గ్రామంలో చోటుచేసుకుంది. వీరంతా బంధువులే కావడం గమనార్హం! వివరాలు..గ్రామానికి చెందిన మునిరెడ్డి, రుక్మిణి, మరో వర్గానికి చెందిన బుడ్డన్న, కమలమ్మ, బుడ్డక్క ఒకరిపై మరొకరు దాడులు చేసుకున్నారు. గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ ఎంపీటీసీకి నివాళి

బంగారుపాళెం: మండలంలోని తుంబకుప్పం మాజీ ఎంపీటీసీ దేవేంద్రరెడ్డికి మాజీ ఎమ్మెల్యే, పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ నివాళులర్పించారు. తుంబకుప్పంలో మంగళవారం దేవేంద్రరెడ్డి భౌతికకాయాన్ని సునీల్‌కుమార్ సందర్శించారు. పార్టీ ఓ మంచి కార్యకర్తను కోల్పోయిందన్నారు. మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. పార్టీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, జెడ్పీమాజీ చైర్మన్ కుమార్‌రాజా, రాష్ట్ర వ్యవసాయ విభాగం కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ లీలావతమ్మ, మాజీ సర్పంచ్ అరుణామల్‌రెడ్డి, శాంతమ్మ, సీనియర్ నాయకులు విద్యాసాగర్‌రెడ్డి, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షులు పాలాక్షిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కృపాసాగర్‌రెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు కిషోర్‌కుమార్‌రెడ్డి, బీసీ నాయకులు మార్కొండ, మునిరత్నం, మంజునాథ్ నివాళులర్పించారు.

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టండి

- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపు



తిరుపతిలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కలసిన ఎంపీపీ భాస్కర్‌రెడ్డి తదితరులు

పుంగనూరు: ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక నెరవేర్చకపోవడంతో పాటు ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని పుంగనూరు ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రాజశేఖర్‌రెడ్డి తిరుపతిలో పెద్దిరెడ్డిని కలిశారు. పుంగనూరులో పలు అభివృద్ధి కార్యక్రమాలు, వేసవిలో మంచినీటి సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన స్పందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చకపోవడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు పడుతున్న ఇబ్బందులు గ్రామ గ్రామాన చాటిచెప్పాలని, అలాగే కూటమి ప్రభుత్వం చేస్తున్న అక్రమాలు, అరాచకాలను ఎప్పటికప్పుడు అడ్డుకునేందుకు సన్నద్ధం కావాలన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటున్న కూటమి నేతలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ యువరాజు

- ఎంపీపీ యువరాజు విమర్శ

వి.కోట : మండలంలోని కూటమి నేతలు అధికారం అండతో మండలాభివృద్ధిని అడ్డుకుంటూండటం సరికాదని ఎంపీపీ యువరాజు మండిపడ్డారు. మంగళవారం వి.కోటలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన ప్రజాప్రతినిధులతో కలిసి మాట్లాడారు. కొంతమంది కూటమి నేతలు మండలంలోని అన్ని పంచాయతీల్లోనూ అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారన్నారు. ప్రస్తుతం మండలంలోని చాలా వరకు గ్రామాల్లో నీటి సమస్యలు తలెత్తుతున్నాయని, దీనిపై ప్రజలు స్థానిక ఎంపీటీసీ, సర్పంచ్‌లకు నివేదిస్తుండడంతో తాము వెంటనే స్పందించి ఎంపీపీ, జెడ్పీ నిధులను మంజూరు చేయిస్తున్నట్లు చెప్పారు. అయితే ఎంపీపీ, జెడ్పీ నిధులతో గ్రామాల్లో నూతన బోర్లను ఏర్పాటు చేయించడానికి వెళితే బోరు బండిని కొంతమంది స్థానిక కూటమి నేతలు అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ముఖ్యమంత్రిగా జగనన్న పార్టీలు, కులమతాలకతీతంగా అర్హులందరికీ న్యాయం చేశారని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వ పాలన దీనికి భిన్నంగా సాగుతోందని, ఇకనైనా కూటమి నేతలు బోరు బండిని, గ్రామాల్లో అభివృద్ధి పనులను అడ్డుకోవడం స్వస్తి పలికి, ప్రజలకు మంచి చేయాలని హితవు పలికారు. సమావేశంలో పలువురు సర్పంచులు, ఎంపీటీసీ, కార్యకర్తలు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం: రూ.50 వేల ఆస్తి నష్టం



గుట్టకిందపల్లెలో మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

చౌడేపల్లె: గడ్డివామి దగ్ధమై ఆస్తినష్టం సంభవించింది. ఈ ఘటన సోమవారం రాత్రి కాగతి పంచాయతీ పంచాయతీ చెడుగుట్లపల్లెలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం..గ్రామంలో రమేష్‌కు చెందిన గడ్డివామి పక్కన ఇంటిలోని చెత్తాచెదారం పడేశారు. దీనికి నిప్పు అంటుకోవడంతో పక్కనే ఉన్న గడ్డివామి, కొయ్యసామగ్రి కాలి బూడిదయ్యాయి. ఈ ఘటనలో సుమారు రూ.50 వేల ఆస్తి నష్టం కలిగిందని బాధితుడు చెప్పాడు. సమాచారం అందుకున్న పుంగనూరు ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు.